
# ఇది ఓట్ల కథ

బొల్లిముంత నాగేశ్వరరావు



పట్టణంగా మారబోతున్న అదో పెద్ద గ్రామం. సినిమాహాల్స్, ఫ్యాన్సీ షాపులూ, హోటళ్ళు, దుకాణాలూ అన్నీ ఉన్నాయి. ఒక ప్రక్క ఎత్తైన భవనాలూ, మరో ప్రక్క మురికి పేటలూ ఉన్నాయి.


ఒక జూనియర్ కాలేజీ ఉంది. నాలుగు ప్రాథమిక పాఠశాల

లున్నాయి.

సారా దుకాణాలూ, త్రాగి తిట్టుకుంటూ అప్పుడప్పుడు కొట్టుకునే జనమూ, అవన్నీ నమోదు చేసుకుని కోర్టులకు కేసులు మోసుకుపోయే పోలీస్‌స్టేషనూ, ఆ కాబోయే పట్టణంలోనే ఉన్నాయి.

మేజర్ పంచాయతీపోయి మునిసిపాలిటీ హోదా దానికి రాబోతుందని జనం ఒకటే పనిగా చెప్పుకొంటున్నారు.

అలాంటి 'రాజునగరం' అనే పెద్ద గ్రామానికి ఒక ప్రక్క విశాలమైన స్థలం ఉంది. ఆ విశాలమైన స్థలాన్ని మేజరు పంచాయితీ వాళ్ళు ప్రజల రాజకీయ, సాంస్కృతిక ఉపయోగాలకు ప్రజలకే




కథా నిలయం
శ్రీకాకుళం

అంకితం చేశారు.

ఆ విశాలమైన స్థలానికి సరిహద్దులంటూ ప్రత్యేకంగా ఏం లేవు గాని, ఒక ప్రక్క సిమెంటుతో

కట్టడమైన ఒక పెద్ద వేదిక ఉంది. ఆ వేదికకు, 4 మూలలా 12, 15 అడుగుల ఎత్తులో నిటారుగా ఇనుప గొట్టాలున్నాయి. ఏదైనా బహిరంగసభలు లాంటివి జరగా లంటే ఆ ఇనుప గొట్టాలను కలుపుతూ ఎదురు బొంగుల్ని పై భాగంలో కట్టుకొని, వాటిమీద అప్పటికప్పుడు ఎవేవో చాపల్నీ, తాటి అకుల్నీ వేసి పందిరి తయారు చేసే వాళ్ళు.

వేదికకు ఎదురుగా మరో ప్రక్క ఎత్తైన దిమ్మెమీద గాంధీ విగ్రహముంది. ఆ గాంధీ విగ్రహానికి వెనుకగా, ఆ ప్రాంతానికి సరిహద్దన్నట్లు ఎర్రటి దుమ్ము లేచే ఒక బజారుంది. ఆ వీధికెప్పుడైనా కంకర ఎర్రగా ఉండేది పరచటం తప్ప, క్రింద పెద్దరాయి పరచి నల్లటి ముక్క ఉపయోగించలేదు.

వేదిక, గాంధీ విగ్రహమూ ఉత్తర దక్షిణాలుగా ఉంటే, ఆ ప్రాంతానికి తూర్పువైపుగా గుడిసెలూ, చిన్న చిన్న పూరిళ్ళూ ఉన్నాయి. ఆ పూరిళ్ళకు వెనుకగానూ, ముందుగానూ మురుగు కాల్వలున్నాయి. పట్టణం కాబోయే ఆ గ్రామం మురుగంతా ఆ పేద వారి గుడిసెల దగ్గరికే చేరుతుంది.

ఆ మురుగు కాల్వల్లో పందులు, దోమలూ ఎప్పుడూ ఉంటాయి. పందులు ఆ గుడిసెల చుట్టూ పగలు అరుస్తూ తిరుగుతుంటాయి. దోమలు రాత్రుళ్ళు సంగీతం పాడుతుంటాయి. మురుగు గుంటల్లోని మలేరియా క్రిముల్ని పేద వాళ్ళ శరీరాల్లోకి చేరవేస్తుంటాయి.

పడమరగా మాత్రం పెద్ద పెద్ద భవనాలున్నాయి. ఆ ఊరిలోని వ్యాపారస్తులూ, కాస్తనుండి ఎక్కువగా కలిగిన వాళ్ళూ అక్కడే నివసిస్తున్నారు. 2 రైస్ మిల్లులు కూడా ఆ భవనాలకు కాస్త దూరంలో ఉన్నాయి.

* * *

ఆ విశాలమైన ప్రాంతంలో అనేకసార్లు అనేక బహిరంగ సభలు జరిగాయి. అనేకమంది రాజకీయనాయకులు తమ తమ ఉపన్యాసాలను అక్కడి ప్రజలకు అందించారు.

వేదిక మీదెక్కి ఉపన్యాసం చెపుతుంటే ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం తమవైపే తిరిగి ఉండటం, ప్రతి రాజకీయ నాయకుడికీ స్పష్టంగా కనిపించేది.

అలా సత్యం-సత్యం అంటూ చనిపోయే వరకూ గోలపెట్టిన పెద్ద పెద్ద నాయకుల విగ్రహాలు, ఉపన్యాసాలు చెప్పే రాజకీయ నాయకు

లకు ఎదురుగా ఉండటం ఏమంత మంచిది కాదని ఎవరో రాజకీయ నాయకుల మానసిక శాస్త్రవేత్త పదే పదే ఘోషించి అనేక మందికి రహస్యంగా చెప్పాడట.

రాజకీయా లెప్పుడూ అబద్ధాలతో నిండి ఉంటాయి గనుక, అలాంటి అబద్ధాల్ని ఆవేశంగా ప్రజలకు వివరించేప్పుడు 'సత్యమూ' 'గాంధీ' విగ్రహాలు ఎదురుగా నిలబడి మనసులో కొస్తే ఉపన్యాసంలోని ఉత్తేజం తగ్గిపోతుందనీ, ఫలితంగా ప్రజల్ని అనుకున్న మార్గం వైపుకి మళ్ళించటం కష్టమవుతుందనీ ఆయనే చెప్పాడట.

అమాయకులైన ప్రజల్ని చూస్తే అసలు రాజకీయ నాయకులకు అనుకోని 'ఎలర్జీ' ఒకటి వస్తుందనీ. వెంటనే ఆవేశ మొస్తుందనీ, ఆవేశంలో అబద్ధాలు వాటంతటవే దొర్లుతాయనీ, ఉపన్యాసాల్లోని దశల్ని కూడా ఆయన వివరించాడట.

ఫలితాన్నిచ్చే ఆ ఎలర్జీని 'ఎవిల్' మందుల్లాంటి ఈ విగ్రహాలు ఎదురుగా తగ్గించేస్తాయనీ, దీని మీద రాజకీయ నాయకులే ఒక నిర్ణయం తీసుకోవాలనీ,ఆయన అక్కడక్కడ హెచ్చరికలు కూడా చేశాడట.

ఎవరు ఎలా చెప్పినా, ఇక్కడ మాత్రం విగ్రహం ఎదురుగానే ఉంది. ఏ రాజకీయ నాయకుడి ఉపన్యాసంలోని ఉత్తేజమూ ఆవగింజలోని అరవయ్యో వంతు కూడా తగ్గలేదు.

* * *

ఆ రోజు కూడా మామూలుగానే తెల్లవారింది. ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో ఎవరికీ తెలీదుగాని గాంధీ విగ్రహం నడుం వరకూ విరిగి నేల మీద పడింది. జనం చుట్టూ మూగారు. అసలెలా విరిగి పడిందని అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. రకరకాలుగా తోచింది చెప్పుకున్నారు.

ఆ వార్త ఆ నోటా, ఆ నోటా ధ్వనిస్తూ హరినారాయణగారి క్కూడా జేరింది. హరినారాయణ గారు ఛైర్మన్ కాబోయే సర్పంచ్ గారు. ముందు కారుల్లో దాచుకోబోయే తమ కాళ్ళతోనే ఆయన అక్కడికి నడిచి వచ్చాడు. విరిగి పడ్డ విగ్రహాన్ని ఎగా దిగా చూసి మనసులో ఎంతగానో నొచ్చుకున్నాడు.

విగ్రహం దానంతటదే విరిగి పడిందనీ, ఇలా విరిగిపడ్డ విగ్రహానికి ఎవరూ కారణంకాదనీ, ఇదేదో

అరిష్టానికి మూలమనీ, కాస్తంత బయటి దుఃఖానికి మరింత లోపలి వేదాంతాన్ని జేర్చి, హరినారాయణ గారు అక్కడ మూగిన జనానికి ఓ చిన్న సైజు ఉపన్యాసాన్ని చెప్పి చక్కా తిరిగి పోయాడు.

వెనుతిరిగి . పోతూ పోతూ వెంటనే విగ్రహం ప్రతిష్ఠించటం జరుగుతుందని చెప్పి మరీ పోయాడు.

ప్రజల మనసులు తేలికపడ్డాయి.

* * *

విరిగిపోయిన గాంధీ విగ్రహానికి కాస్తంత దూరంలో గంగన్న పూరి కొంప ఉంది. ఆ పూరి కొంప మీద సగం తాటాకులు మాత్రమే ఉన్నాయి. బయటి వర్షమైతే కురిసినంత సేపూ కురిసి మాయమవుతుంది. వెంటనే ఎండ వస్తుంది. కానీ గంగన్న కొంపలో వర్షం వెలిశాక కూడా కురుస్తూనే ఉంటుంది. పొగచూరిన తాటియాకుల్లోంచి ఎర్రటి నీటిచుక్కలు రాలుతూనే ఉంటాయి.

వర్షాకాలం వానకురిశాక, చలికాలం చలికరపటం మొదలెడుతుంది. గంగన్న, అతని కుటుంబ సభ్యులూ వణుకుతూ ఆ కాలమంతా అరుస్తూనే ఉంటారు.

ఇంతలో వేసవికాలం తన అగ్నిశ్వాసల్ని క్రక్కుతూ పరిగెత్తుకువస్తుంది. అతని ఇంట్లో జొరబడి వారందరినీ కాల్చి, ప్రేల్చిమరీ పోతుంది.

ఆహారం దొరక్క కృశిస్తూ కాలం కాలానికి గంగన్న నశిస్తోనే ఉన్నాడు.

అలా నశించే గంగన్నకు—

పొడుగాటి మెడ ఉంది. ఆ పొడుగాటి మెడ మీద జీవితం బరువుతో పాటు ఆలోచనల బరువును మోసే తల వుంది. ఆ తలకు ముందు భాగంలో లోతుకు పోయిన కళ్ళూ, పీక్కుపోయిన బుగ్గలూ ఉన్నాయి. ఇంకా ఏదేదో తిందామని ఆశపడి ఏమీ దొరక్క ఏదో తినే నోరుంది. ఎందుకీ ప్రాణవాయువుల్ని లోనికి పంపటం,బయటికి పంపటం అన్నట్టు అలసిపోయి మూసుకు పోయిన ముక్కుంది. ముక్కుకు క్రింద తెల్లారిన బ్రతుకుల్లా తెల్లబడిపోయిన వెంట్రుకలు గుబురుగా ఉన్నాయి.

ఇంటి మీద సగం ఆకుల మాదిరిగానే గంగన్నకు వంటిమీద కూడా సగం గుడ్డలే ఉన్నాయి.

గంగన్న దగ్గుతూ ఉన్నాడు.

ఇటీవల అటుగా ఆ రోడ్డు మీద

ఎవరుపోయినా గంగన్న దగ్గు విని పిస్తూనే ఉంటుంది.

అలాంటి దగ్గుతూ ఉండే గంగన్నకు రోగంతో ఉండే భార్య ఉంది. ఆమె కెన్ని సంవత్సరాల నుండో కడుపులో పుండు ఉంది.

పుండు లేవటానికి ముందు ఆమెకు కడుపు నాలుగుసార్లు పండింది. ఇద్దరు చనిపోయారు. మరో ఇద్దరు మిగిలారు. ముందుగా పుట్టింది రావులమ్మ. సినిమాహాల్లో సిమెంటు బొచ్చలుమోసే వయసుకు ఎదిగింది, ఇంకా మిగిలినవాడు బసవడు. రాజాల బీడీల కొట్లో సరుకు లందిస్తుంటాడు.

రోజంతా బొచ్చలుమోస్తే రావులమ్మకు రూపాయిన్నర వస్తుంది. బసవడికి అర్థరూపాయి వస్తుంది. వచ్చిన రెండు రూపాయిల్నీ శెట్టిగారి దుకాణానికి తీసుకుపోతే ముప్పావుశేరు బియ్యమూ, మూడు ఎండు మిరపకాయలూ, గోళీకాయంత చింత పండూ, రెండు అగ్గి పుల్లలూ వస్తాయి....

తన పుండు కడుపుకు ఎండు మిరపకాయల మెతుకులు తినలేక రావులమ్మ తల్లి 'దేశమ్మ' గాంధీగారి విగ్రహం విరిగిపడ్డ సరీగ్గా వారంరోజులకు తన ప్రాణ వాయువుల్ని అనంత వాయువుల్లో కలిపేసింది.

గంగన్న ఏడవలేక కాస్సేపు దగ్గాడు.

ఆనాటి బొచ్చలు మోసే శక్తిని రావులమ్మ,తల్లి మరణించినందుకు దుఃఖంలో శోకాలు తీసేందుకు ఉపయోగించింది. బసవడు మాత్రం ఎందుకేడవాలో అర్థంకాక బీడీల కొట్టుకు పోయేడు.

*    *    *

"నా బతుకు ఇరిగిపోయినాది దొరా! 'దగనం' సెయ్యాలి, డబ్బుల్లేవు." చేతులు నలుపుకుంటూ గంగన్న హరినారాయణ దగ్గర నిలబడ్డాడు.

"అందుకు నేనేం చేసేదిరా?" హరినారాయణగంభీరంగాఅన్నాడు.

"ఓటు లొచ్చినాది మొదలు తవరినే నమ్ముకుండాం. అన్ని సారులూ తవరికే ఏసినాం. తవరు ఏయమన్నారికేసినాం. నోరెత్తి ఎన్నడూ తవరిని పైసా అడగలేదు. పోరంబోకులో ఇల్లేసుకో నిచ్చేరు....అంతే సాలని అదీ నేనూ మురుసుకొనే వాళ్ళం." గంగన్న గోడుగా చెప్పుకున్నాడు.

"ఏం .... దహనమే చెయ్యాలంట్రా? పాతేస్తే పోలా?" సమస్యకు పరిష్కారం దొరికినట్లు టపీమని సర్పంచ్ గారన్నారు.

"పాతేత్తే సచ్చి పోయిన దాని 'ఆతమ' శాంతంగా ఉండదు బాబూ! తగలేసే ఆశారం ఎట్టా తప్పించ మంటారు?" గంగన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏమిట్రోయ్....దాని కూ్కడా ఆత్మ ఉంటుందేమిటి?" హరినారాయణగా రదోరకంగా అని, లోపల మాత్రం.... 'చచ్చి పోయిందది ఎటూ చచ్చింది...వీడు చూస్తే రేపో, మాపో అనేట్టున్నాడు. మళ్ళీ ఎలక్షన్స్ వచ్చే సరికి, వీడి కొంప లోంచి ఒక్క ఓటు కూడారాదు—' అనుకున్నాడు. అనుకోవటంలో గట్టిగా అనుకున్నాడు. వెంటనే-

"నా కవతల బోలెడెంత పని ఉంది. విరిగిపోయిన గాంధీ విగ్రహాన్ని మరలా వెంటనే ప్రతిష్ఠించాలి. ఊరిలో చందాలు ప్రోగు చేస్తున్నాను. ఇదిగో ఈ రూపాయి తీసుకుని ఇలాగే నలుగురినీ అడుక్కుంటూ అలాగే దహనం చేసుకో...." అంటూ ఆగకుండా గబగబా వెళ్ళి పోయాడు.

గంగన్న ఆగని కన్నీటిని తుడుచుకుంటూ, వెనుతిరిగాడు.

* * *

కొన్ని రోజుల తర్వాత—

అదే విశాలమైన స్థలంలో—

విరిగిపోయిన గాంధీగారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేశారు.

స్థానిక యం.యల్.ఏ. మొదలు మంత్రిగారి వరకూ ఆ సమయంలో ఆహ్వానించ బడ్డారు.

ఆ సభలో ఆ గ్రామంలోని ప్రజలు చాలా మంది పాల్గొన్నారు. హరినారాయణ గారి భార్య లక్ష్మీకాంతమ్మ కూడా ఆ సభకు వచ్చింది. వారు చెప్పే ఉపన్యాసాల్ని శ్రద్ధగా వింది. చివరలో చెప్పిన భర్తగారి ఉపన్యాసంకూడా వింది.

"మహాశయులారా!....

ఆ రోజు....అంటే గాంధీగారి విగ్రహం విరిగి పడ్డ రోజు నాకు కబురొచ్చింది. హుటాహుటిని వచ్చి చూశాను. విగ్రహం సగం వరకూ విరిగి పడి వుంది. ఆ దృశ్యం చూపిన నాకు మనసు ఆందోళన చెందింది. ఏమిటి మార్గమని తీవ్రంగా ఆలోచించాను.

పేదా, బిక్కీ కోసం ఆయనెంతగానో పాటుపడ్డాడు. హరిజనుల సేవలోనే ఆయన జీవితాన్ని ధారబోశాడు. అలాంటి మహామహుడు ఈనాడు మన మధ్య లేకపోయినా ఆయన ఆత్మ మాత్రం మనల్ని నిత్యం చూస్తూనే ఉంటుంది. ఆ విగ్రహం అలాగే

పడి వుంటే - అందుకు మనం ఏమీ చేయకుంటే ఆయన ఆత్మ క్షోభిస్తుంది.

ఆ మహా మహుడి ఆత్మ శాంతించాలనే ఉద్దేశ్యంతో వెంటనే డబ్బు ప్రోగుచేసి ఈ విధంగా విగ్రహాన్ని పునః ప్రతిష్ఠ చేయాల్సి వచ్చింది, చేశాం."

జనమంతా చప్పట్లు కొట్టారు. అంత శర వేగంగా గాంధీగారి విగ్రహ ప్రతిష్ఠ జరిపించినందుకు హరినారాయణ గారిని జనమంతా పొగిడారు.

* * *

యం. ఎల్. ఏ. నూ, మంత్రి గాగినీ, ఇంకా హాజరైన ప్రముఖుల్నీ సాగనంపి, హరినారాయణ యింటికి చేరాడు. ముభావంగా ఉన్న శ్రీమతి ముఖం కేసి....

"సభలో నా ఉపన్యాస మెలా వుంది?" చిరునవ్వుతో అడిగాడు.

"చప్పట్లు కొట్టేలా వుంది."

"అంటే నీకు నచ్చలేదా?"

"ఎందుకు నచ్చాలా .... కానీ కొన్ని అనుమానా లలాగే ఉండి పోయాయి?"

"ఏమిటో అవి?"

"ఆత్మ లెవరెవరికుంటాయి?"

"చనిపోయిన అందరికీ వుంటాయి."


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ____________
విలాసము. ____________
____________ PIN ____________


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ —సికిందరాబాద్—

"చనిపోయిన గంగన్న భార్య కూడానా?"

"ఏం? ఎందుకుండ గూడదు?"

"మరారోజు.... 'ఏమిట్రోయ్ దానిక్కూడా ఆత్మ ఉంటుం దేమిట'ంటూ ఎగతాళిగా అన్నారేం?"

"ఏదో వాడిని ఓదార్చాలనీ, దహనం చేయటం ఆపేసి పాతేస్తా డనీ అన్నాను?"

"మరి అప్పుడు ఆమె ఆత్మ క్షోభించదా?"

"ఏమిటీ అర్థం లేని ప్రశ్నలు?"

"అర్థమున్న ప్రశ్నలే. నిజంగా చనిపోయిన వారి ఆత్మలు మన లోనే తిరుగుతుంటే ... ఇప్పుడు మీరు చేసిన పనికి గాంధీగారి ఆత్మ క్షోభిస్తుంది."

"ఎందుకు?"

"ఆయన ఎవరిని ఉద్ధరించాలను కున్నాడో వారిలోని ఒక మనిషి - తిండి కూడా గడవని మనిషి - భార్య చనిపోయిందంటూ మీ ముందు కొస్తే - చాలా నిర్దయగా ఒక రూపాయి వాడి ముఖాన పార వేసి, ఊరిలో చందాలు వసూలు చేయటానికి పోయారు. వేల రూపాయిలు వసూలు చేసి, విరిగిన విగ్రహాన్ని అతికి- సభలూ, సమా వేశాలూ జరిపారు.

'నా బ్రతుకు- నిజమైన బ్రతుకు విరిగింది బాబూ' అంటూ ఆ మనిషి గోల పెట్టి ఏడిస్తే కసిరి త్రిప్పి పంపారు.గాంధీ గారి ఆత్మ నిజంగా ఉంటే ఇది సహిస్తుందంటారా?

"నోరుముయ్. ఎక్కడ నేర్చు కున్నావీ పిచ్చి పిచ్చి వాగుడు- ఆ చేతులోదేమిటి?"

"కథల పత్రిక."

"అందుకే నీ పైత్యం తలకి ఎక్కింది."

కోపంగా అని ఆయన బీరువా ఉండే గదిలోకి పోయాడు. ఐదు వేల రూపాయల్ని అందులో పెడుతూ,' ఎదుగుతున్న ఈ ఊరూ, నేనూ దీనికిలా అర్థమయితే తం టానే! అసలు ఆత్మలూలేవు, అధ్వా న్నమూ లేవు.గంగడి భార్య కాత్మ ఉందంటే ఏభై రూపాయలన్నా వాడి చేతిలో పెట్టాల్సి వచ్చేది. గాంధీగారి ఆత్మ నొప్పుకోబట్టే.... అందులో ఇప్పుడైదు వేల రూపా యలు మిగిలాయి' అనుకున్నాడు.

వెంటనే ఆయన మనసులోకి ఒక ఆలోచన మెరుపులా వచ్చింది-

'ఈ పిచ్చి ముఖంది అప్పట్లో గంగడిని వెనక్కి పిలిచి ఏమయినా ఇచ్చిందేమో? వాడు తిరిగి వెళ్ళి పోయే వరకూ ఇంటిదగ్గరే ఉం డాల్సింది' అని. *